# సీఎం కేసీఆర్ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

నేరేడ్‌మెట్, అక్టోబర్ 16: సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం నేరేడ్‌మెట్ శ్రీకాలనీలోని పార్టీ కార్యాలయంలో గౌతంనగర్ డివిజన్ అయ్యన్‌నగర్‌కు చెందిన వివిధ పార్టీ నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు మరిన్ని ప్రయోజనాలను కలుగజేస్తు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేయడంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు వాటికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో కృష్ణగౌడ్, సిద్ధు, రాములు, పరమేశ్, నర్సింగ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



వివిధ పార్టీల నేతలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసుల తనిఖీలు

మారేడ్‌పల్లి, అక్టోబర్ 16: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీను ఆధ్వర్యంలో తన సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫారాలు, పలు రైళ్లు, వెయిటింగ్ హాళ్లు, అనుమానాస్పద వ్యక్తుల బ్యాగ్‌లను తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో రైళ్లలో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి వస్తువులు సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీను తెలిపారు. దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రయాణికులందరూ వారి వారి ప్రాంతాలకు సురక్షితంగా వెళ్లాలన్నారు. అదేవిధంగా రైళ్లో ప్రయాణించే సమయంలో బంగారం వెండి, ఇతరత్ర విలువైన వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపడుతున్న రైల్వే పోలీసు సిబ్బంది, ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీను

### బంగారం, ల్యాప్‌టాప్ అప్పగింత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని వెయిటింగ్ హాల్‌లో ఓ మహిళ ప్రయాణికురాలి బ్యాగ్‌ను మరో ప్రయాణికుడు తీసుకెళ్లడంతో వెంటనే బాధితురాలు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ద్వారా దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే...వనపర్తిలో నివాసం ఉంటున్న పూనం అనే యువతి పర్యావరణ శాఖలో ఇంజినీర్‌గా పని చేస్తుంది. పని నిమిత్తం భువనేశ్వర్ వెళ్లేందుకు ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి వెయిటింగ్ హాల్‌లో ఉంది. కొంత సేపటి తరువాత తన 20 గ్రాముల బంగారు నగలు, 100 గ్రాముల వెండి తో పాటు ఒక ల్యాప్‌టాప్ కలిగి ఉన్న బ్యాగ్‌ను అక్కడి ఉంచి వాటర్ బాటిల్ కోసం బయటికి వెళ్లింది. తిరిగొచ్చే సరికి తన బ్యాగ్ కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అదే వెయిటింగ్ హాల్‌లో ఉన్న ఓ ప్రయాణికుడు బాధితురాలు పూనం అనే యువతి బ్యాగ్‌ను తీసుకెళ్లాడు. ఇంటికి వెళ్లిన తరువాత బ్యాగ్‌ను ఓపెన్ చేసి చూడగా...ఈ బ్యాగ్ తనది కాదని వెంటనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి రైల్వే పోలీసులకు అందజేశారు. రైల్వే పోలీసులు బాధితురాలు పూనం కు సమాచారం అందజేసి సోమవారం ఆమెకు బ్యాగ్‌ను అప్పగించారు.



ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను అందజేస్తున్న దృశ్యం

## ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు చేస్తాం..

గోల్నాక, అక్టోబర్ 16 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేటలో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు చేస్తామని అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్‌ముదిరాజ్ స్పష్టం చేశారు. అందుకు అంబర్‌పేట డివిజన్‌లో తొలి రోజు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేపట్టిన ఇంటింటి ప్రచారానికి ప్రజలు చూపించిన అపూర్వ స్పందనే ఇందుకు నిదర్శనమని అన్నారు. పార్టీ మ్యానిఫెస్టో చూసి ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్ అయ్యిందని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల కంటే ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను అంబర్‌పేట డివిజన్ నుంచి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఆయన అన్నారు.

## శస్త్ర చికిత్సలో అనస్థీషియా కీలకం

### గాంధీ దవాఖాన సూపరిండెంటెంట్ డాక్టర్ ఎం.రాజారావు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 16 :శస్త్రచికిత్స నిర్వహించేటప్పుడు రోగికి నొప్పి తెలియకుండా ఇచ్చే అనస్థీషియా (మత్తు మందు) ఎంతో కీలకమని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు అన్నారు. ప్రపంచ అనస్థీషియా దినంను పురస్కరించుకొని సోమవారం గాంధీ దవాఖాన అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం గాంధీ విగ్రహం నుంచి బయటి రోగుల విభాగం, అత్యవసర విభాగం మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల వైద్యులకు అనస్థీషియా ప్రాముఖ్యత గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాంధీ దవాఖాన అనస్థీషియా విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ హెచ్.ఎల్.రాణి, ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియా కార్యదర్శి డాక్టర్ ఎ.మురళీధర్, ఐఎస్ఏ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, ప్రొఫెసర్ నాగార్జున చక్రవర్తి, ప్రొఫెసర్ శ్రీదేవి, అనస్థీషియా విభాగం వైద్యులు, పీజీలు, నర్సులు పాల్గొన్నారు.




అనస్థీషియా దినం సందర్భంగా అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న సూపరిండెంటెంట్ డాక్టర్ రాజారావు

### నేడే కంటోన్మెంట్ నియోజకవర్గం

## బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

### హాజరుకానున్న మంత్రి తలసాని

కంటోన్మెంట్, అక్టోబర్ 16: నేడు కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో జరగనుంది. నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి రాష్ట్ర మంత్రి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఏర్పాట్లను ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితతో పాటు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్‌లు పరిశీలించి, సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### కంటోన్మెంట్‌పై మంత్రి తలసాని ప్రత్యేక దృష్టి

కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంపై దివంగత ఎమ్మెల్యే సాయన్న అకాల మరణం అనంతరం మంత్రి తలసాని ప్రత్యేక దృష్టిని సారించిన విషయం అందరికీ తెలిసిందే. లాస్యనందితను అభ్యర్థిగా నిలపడంలో కీలకపాత్ర పోషించిన మంత్రి తలసాని పార్టీ శ్రేణులందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చి ఆమె గెలుపునకు కృషి చేస్తున్నారు. కంటోన్మెంట్ నుంచే బీఆర్ఎస్ పార్టీ జైత్రయాత్ర ప్రారంభమయ్యేలా చూడాలని బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు పట్టుదలతో శ్రమిస్తున్నారు.

### సమావేశానికి ఏర్పాట్లు పూర్తి

బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని బొల్లారం, తిరుమలగిరి, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, మోండా డివిజన్, కార్ఖానా, రసూల్‌పురాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభించి, మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యకర్తలకు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కార్యకర్తలు తీసుకోవాల్సిన చర్యలు, ప్రతిపక్షాలు చేసే ఆరోపణలు, తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టే వ్యూహాలు, ప్రచారం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోషల్ మీడియా ప్రచారం, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేర్చే విషయంలో కార్యకర్తల పాత్ర తదితర అంశాలన్నింటిపై సుదీర్ఘంగా చర్చించి వ్యూహం రచించనున్నారు.

### సభను విజయవంతం చేయండి

నేడు నిర్వహించే కంటోన్మెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి సకాలంలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.



– జక్కుల మహేశ్వర్‌రెడ్డి,
మాజీ ఉపాధ్యక్షులు, కంటోన్మెంట్

### సబ్బండ వర్గాల ప్రజలు హర్షం

సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోపై సబ్బండ వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.సీఎం కేసీఆర్ ఆరోగ్య రక్ష,కేసీఆర్ బీమా-ప్రతి ఇంటికి ధీమా పథకం చాలా బాగుంది. సహజంగా మరణించినా పేద కుటుంబంలో రూ.5లక్షలు ఇవ్వడంతో వారి కుటుంబానికి ఆసరా ఉంటుంది.ఇది దేశ రాజకీయాల్లో బిగ్ అచీవ్‌మెంట్ స్కీం.బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో రూపొందించిన సీఎం కేసీఆర్‌కు అన్ని వర్గాల ప్రజల నుండి మద్దతు లభిస్తుంది.



ఖదీర్‌వన్,బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్, బొల్లారం

## దివ్యాంగుల ఆశాజ్యోతి సీఎం కేసీఆర్

మల్కాజిగిరి, అక్టోబర్ 16: దివ్యాంగుల ఆశాజ్యోతి సీఎం కేసీఆర్ అని మల్కాజిగిరి పట్టణ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుల్తాన్ రమేశ్ అన్నారు. సోమవారం దివ్యాంగుల పెన్షన్‌లను రూ.4,016 నుంచి దశలవారీగా రూ.6,016వరకు పెంచనున్నట్లు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పెట్టడంతో దివ్యాంగులు మల్కాజిగిరి చౌరస్తాలో సీం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మ్యానిఫెస్టోలో దివ్యాంగుల పెన్షన్‌లను పెంచుతామని హామీ ఇవ్వడం హర్షణీయమని అన్నారు. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు.



బొల్లారం ముత్యాలమ్మ ఆలయంలో శ్రీ రాజ రాజేశ్వరీ దేవి అలంకరణలో దర్శనం



శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో శ్రీ గాయత్రి దేవి అలంకరణలో

## అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్

వెంగళరావునగర్, అక్టోబర్ 16: అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం వెంగళరావునగర్ డివిజన్, మధురానగర్‌లో కాలనీ వాసులు నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీలు, బస్తీల్లో వీధి దీపాలు, సీసీ రోడ్లు, సీసీ టీవీ కెమెరాలు, మురుగు కాల్వల నిర్మాణం,అందమైన పార్కుల నిర్మాణం ముఖ్య మంత్రి నాయకత్వంలో సమర్థవంతంగా అమలు చేశామన్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ...ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌కు మా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

ప్రజా సంక్షేమం కోసం తపించే ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు హ్యాట్రిక్ విజయం అందిస్తామని వారంతా ముక్తకంఠంతో అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య రావు, కాలనీవాసులు శివా రెడ్డి, కోడే సాంబశివరావు, రామకృష్ణ, జీటీఎస్ దేవాలయం చైర్మన్ చిన్న రమేశ్, మాజీ కార్పొరేటర్ శ్యామ్‌రావు, వేణు, తదితరులు పాల్గొన్నారు.